# ధనమూలమిదం జగత్



మ్మా ఒక్క కబళం పెట్టించండమ్మగారూ!' చంటిపిల్లతల్లిని. మూడురోజులై పొట్టకు బుక్కెడు బువ్వ దొరకలేదు. చంటోడు, శోషొచ్చి పడిపోయాడు తల్లీ.' పెట్టిపుట్టిన రాజుతల్లులు పిడికెడు బువ్వ దయచేయండి తల్లీ" అని రెండంతస్థుల మేడముందు నిల్చుని ఒక చంటిపిల్లతల్లి అడుగుతూంది. ఎదురుగా హాల్లో వుయ్యాలబల్లమీద ఆయింటి ఇల్లాలు కూర్చుని ఆరోజే వచ్చిన 'గృహలక్ష్మి' చదువుకుంటూంది. ఉదయం పదిగంటలే అయినా అది వైశాఖమాసం అవటంవల్లంచి ఆ చెవిగాడ్పు ఈ చెవికి కొట్టుతూంది. ఎంతో అవసరమైన పనివుంటేతప్ప ఎవరూ రోడ్డుమీద నడవడానికి సాహసించడం లేదు.

ఆ యిల్లు ఒక పేరుపొందిన పెద్దవకీలు గారిది. మొదటిభార్యకు పిల్లలు కలగనందున ఆమెను పుట్టింట దిగవిడచి మళ్లీ రెండో పెళ్లిచేసుకున్నాడు. ఈమెకుకూడ ఇంకనూ పిల్లలు పుట్టలేదు. వకీలుగారి రెండోభార్య అన్నపూర్ణ పట్టివేళ్లపరదా వొత్తిగించుకుని అడుక్కుంటూన్న భిక్షుకిదగ్గరకు చరచరా వచ్చి "ఇందాకటినుంచి మాయగోల ఒక్కలాగ చేస్తున్నావు, అడుక్కుందుకు వేళాపాళా లేదూ? పదిగంటలకే నీకోసరం ఎవరు వండి ఒరగదోశారనుకున్నావు? పో, పో దుక్కలాగ వున్నావు. కూలిచేసుకోరాదూ!" అని అంది.

"పుత్తకలాడి పదేను దినాలైంది అమ్మగారూ, ఏం కూలిచేయను రాజుతల్లీ. పచ్చిబాలింతరాలికి ఒక పాతవస్త్రం దయచేయించమ్మా. కరుణగల తల్లివి. కడుపుమాడి పోతూంది. మూడురోజులై ఒకమెతుకయినా దొరకలేదు. ఒక రొట్టితునకయినా ఇప్పించు తల్లీ" అని ఇక నిల్చోలేక ఆ యువతి కూలబడింది.

"సరి ఇక తిష్టకూడా వేశావూ? నీ కొకమారు చెప్పితే బుద్ధిలేదూ? ఈ లేపను రోజుల్లో నీకెవరు పెట్టుతారనుకున్నావు? ఇక బట్టలు కూడా కావాలి? నా ప్రాణం అట్టే విసిగించక ఇంకొకచోటికి పో!" అని గృహిణి గద్దించింది.

"మీబోటి ధర్మతల్లులే ఇలాగంటే ఎలాగ తల్లీ? ప్రొద్దుటినుంచి తిరుగుతున్నాను, అందరూ పొమ్మన్నవారే.

ఏ తల్లికీ నామీద దయ కలుగలేదు. నాలిక పిడచగట్టిపోతూంది. కొస్త గంజినీళ్ళు పోయించు తల్లీ."

"ఏం ఒక్కమారు చెప్పితే నీకు కాదూ? పోతావా, పోవా? శనిగ్రహంలాగ పట్టుకున్నావు. బంట్రోతును పిలిచి గెంటించాలా?"

"బిడ్డలగల తల్లివి, చంటోడిమీదయినా దయవుంచి ఏమన్నా పెట్టు తల్లీ. మీబోటి అన్నపూర్ణ తల్లులు కనికరించకపోతే మే మెట్లాగ బతకాలమ్మా?"

'బిడ్డలుగలతల్లి' అని భిక్షుకి అన్నమాట అన్నపూర్ణకు చురుక్కున తగిలింది.

"నీబోటి దరిద్రురాలికి పిల్లలుకూడా ఎందుకూ? బతకలేకపోతే ఏ మోటారు క్రిందయినా పడి చావు." అనేసి, గిరుక్కున మళ్ళి, ధణాలున హాలుతలుపు బిడాయించింది. కోర్టులు మూసేయుటచే తీరుబాటుగా ఆఫీసురూములో కూర్చున్న వకీలుగారు ఈ సంభాషణంతా విన్నారు. 'మలి పెండ్లాము మామిడిపండన్నట్లు' రెండో భార్యను ఏమనలేక తన మనస్సు ఎంత బాధపడుతున్నా వూరుకున్నారు. కాని మనస్సులో చాలా జాలికలిగింది. లేచి భార్యకు శబ్దం వినబడనంత నెమ్మదిగా తన బీరువా తాళం తీయడంమొదలుపెట్టుతూండగా. ఎలాగ గ్రహించిందోకాని అన్నపూర్ణ గబగబ లేచివెళ్ళి, "ఏంకావాలి మీకు? బీరువాతాళం ఎందుకు తీశారు?" అని పెనిమిటిని నిలవదీసి అడిగింది.

దాని కాయన తెలతెలపోతూ "ఆఁ ఏమీ లేదు. పాపం ఆ ముష్టిదాని ఒంటి మీద బొత్తిగా బట్ట లేదే! పాతధోవతి ఏమయినా వుందేమో చూచి పారేద్దామని తీశాను. దాన్నిచూస్తే జాలివేస్తూంది," అని భార్యకు సమాధానం చెప్పేడు.

"బాగానే వుంది. ఇలాగ ధర్మాలుచేస్తే మనం కాపురంచేసినట్లే! గొప్ప ధర్మదాతలు బైలుదేరేరు. చాల్చాలు. ఈ ముష్టివాళ్ళసంగతి మీకు తెలియదు. ఇలాగ బట్టలు తీసుకుంటారు. అలాగ పక్కకు వెళ్ళి అమ్మేస్తారు. ఇంతకూ వీళ్ళకిస్తే పుణ్యమా పురుషార్థమా? ఇంక తమరు బీరువా తాళాలు వేసేసి తాళాలు నాకిచ్చేయండి."

ఇక భార్యమాటకు ఎదురుచెప్పేశక్తి లేక ఆయన 'అర్థం ప్రాణం ఆచార్యాధీనం' అన్నట్లు తాళాలు సతీమణిచేతి కిచ్చేశాడు. కాని, 'ఏ మోటారుక్రిందయినా పడి చావు' అని భార్య అన్నమాట చెవులో మారుమోగుతోంది.

చూచి చూచి ప్రాణం విసికి భిక్షుకి "ఏమి కర్మం చేసుకున్నావు చిట్టితండ్రీ. గ్రుక్కెడు పాలయినా నీకివ్వలేని నాలాంటి దరిద్రురాలి కడుపున ఎందుకు పుట్టినావు నాయనా. ఆ యిల్లాలు చెప్పినట్లు ఏ మోటారుకిందయినా పడి చస్తేనో? అమ్మయ్యో! నా బుజ్జినాన్న గతేం కాను! నా బంగారుకొండను ఎవరు చూస్తారు?" అని గుండెల కద్దుకొని తడి ఆరిపోయిన పెదవులతో ముద్దుపెట్టుకుంది. పిల్లాడి ఆకలి బాధ చూస్తే ఆమె కళ్ళల్లో నీరు కాలవలై కారసాగింది. ఆమె గేటుదాటుతుండగా "హరే రామ హరే రామ, రామ రామ హరే హరే" అంటూ ఒక యాయవారపు బ్రాహ్మణుడు లోపల ప్రవేశించాడు.

"అమ్మా యీవాళ ద్వాదశి శుక్రవారం. ద్వాదశి పదకొండు గంటలతో వెళ్ళిపోతుంది. ఉత్తర నక్షత్రం. వర్జ్యం సాయంకాలం నాలుగు గంటలనుండి అయిదు గంటలన్నరదాకా వుంది. చతుర్దశి ఏష్యం. పౌర్ణమి ఆదివారం అయింది" అని చెప్పి ఎవరూ పలకనందున సీతారామాభ్యాంనమః, అని గట్టిగా కేక పెట్టాడు. "గృహలక్ష్మి" లో శారదలేఖలు చదువుతూన్న అన్నపూర్ణ ఆకేక విని వులికిపడి, గృహలక్ష్మి పుస్తకాన్ని కిందపెట్టి, వెనక వరండాలోకి వచ్చి, "రండి విస్సన్నశాస్త్రిగారూ, రండి కూర్చోండి," అని పీట తెచ్చి వేసింది. విస్సన్నశాస్త్రి బుజంమీదున్న భారమైన బియ్యపు మూటలు పక్కకు పెట్టి పీటమీద కూర్చుని 'అబ్బ, ఇవాళ ఎంత ఎండగా వుంది' అని అంటూ పై అంగోస్త్రం తీసి విసురుకోడం మొదలుపెట్టేడు. అది చూచి అన్నపూర్ణ విసనకర్ర పట్టుకొచ్చి విసరసాగింది. శాస్త్రులు ఆమెను వారించి, "అమ్మా కొంచెం శుద్ధిదాహం ఇప్పించాలి. శ్రీనివాసరావు గారింట్లో సత్యనారాయణవ్రతం చేయించి వచ్చేసరికి ఇంత ఆలస్యమైంది," అన్నాడు.

"అయ్యో, నా మతి మండిపోనూ, మీకు పానకం కలిపివుంచి తెచ్చివ్వడం మరిచిపోయాను." అని వంటమనిషిని పిలిచి, "మరచెంబులో పానకం కలిపిపెట్టేను. అది తెచ్చి శాస్త్రులగారికియ్యి," అని చెప్పింది. వంటావిడ మరచెంబునిండా పోసిన పానకం తెచ్చి ఇచ్చింది. శాస్త్రులు ఒక గుక్కలో అంతా పుచ్చేసుకుని," అమ్మయ్యా, ఇవాళ మీరు నాప్రాణం కాపాడేరు. మీకు కాశీరామేశ్వర యాత్రాఫలం సిద్ధించింది. నాకంటికి మీరు సాక్షాత్ కాశీ అన్నపూర్ణాదేవిలాగ కనుపడుతూన్నారు. ఇప్పుడెక్కడ చూచినా గుడ్డి కుంటివాళ్లకు ధర్మం చెయ్యాలి అనేవారే గానీ నాబోటి సద్బ్రాహ్మళ్లను చూచేవారే లేరు. ఏదో మీ బోటి ఉత్తమఇల్లాండ్రు అంటూ వుండబట్టిమాబోటి వాళ్లం నెగ్గుకొస్తూన్నాము. లేకపోతే ఏ పునహా సతారాలకో పోవలసినదే."

"ఆఁ ఎంతమాటన్నారు? మేము చేసే దెంత చంద్రుడికో నూలుపోగు."

"ఉత్తములు అలాగే అంటారు. అమ్మా, ఎండ ఎక్కుతూంది నన్ను పంపిస్తారా?"

"ఆఁ! అలాగే! ఇవాళ ద్వాదశికదూ, మీకు స్వయంపాకం ఇవ్వాలి," అని లోపలికి వెళ్లి పెద్దపళ్ళెంలో రెండు సేర్లు బియ్యం, పావుసేరు పప్పు, రెండు కూరలు, పెరుగు, నెయ్యి మొదలైనవన్నీ, పెట్టి తెచ్చి శాస్త్రులుగారిముందు పెట్టి, నమస్కారము చేసింది. ఇంకొక పళ్ళెంలో పది బంగినపల్లి మామిడిపళ్లు వంటమనిషి తెచ్చిపెట్టింది. ఆ సంబారాలన్నీ చూచి శాస్త్రులు, "ఆహా! అన్నపూర్ణమ్మగారి చేతి కెముక లేదు. ఏమి దాతృత్వం! ఏమి యీవి! అమ్మా మీ ఎదుట మిమ్మల్ని చెప్పరాదు. కాని దైవబ్రాహ్మణభక్తికి మిమ్మల్ని మించినవారు ఇంకొకరు నాకెక్కడా కనపడరు," అని పొగడటం మొదలుపెట్టేసరికి అన్నపూర్ణ వుబ్బితబ్బిబ్బై ముసిముసినవ్వు నవ్వింది.

"అన్నట్లు శాస్త్రులుగారూ మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. మీకు ఎండెక్కుతుందేమో ?"

"అయ్యో, అడగండి తల్లీ, అభ్యంతర


## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిష్టర్డు)

**తెల్లవెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును. ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్తి విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.**

**Bharat Kalyan Aushadhalaya.**

Post Bag No 6725, Calcutta. (A P)

మేముంది? ఎప్పుడూ ఎండలో తిరిగేవాళ్లం మాకేం ఎండ? మరేం ఫరవాలేదు. మీరు అడగదలచిన దేదో అడగండి. చెప్పి వెళ్లుతాను."

"ఏమీ లేదు. ఈ మధ్య మా అమ్మవద్ద నుండి జాబు వచ్చింది. మా వదినెకు పెండ్లయి ఇరవైఅయిదేళ్లు అయింది. ఇంత వరకూ పిల్లలు పుట్టలేదు. కనపడ్డ రాతికల్లా మొక్కేరు. ఎన్నో వ్రతాలు చేసేరు. ఇన్నాళ్ళకు దేవుడి దయవల్ల, మీబోటి పెద్దల ఆశీర్వాదఫలంవల్ల మా వదినెకు నెల తప్పిందట. రెండో మాసమట. వంశం నిలబెట్టేందుకు మగపిల్లవాడు పుట్టతాడా? లేదా? ఈ విషయం మీరు పంచాంగం చూసి చెప్పాలి"

"మీ అన్నగారి నక్షత్రం?"

పూర్వాభాద్ర."

"మీ నక్షత్రం?"

"ఆరుద్ర"

'సరే ఇప్పుడు పదకొండుగంటలైందికదూ,' అని పంచాగంవిప్పి వేళ్లు ముడిచి లెక్కలుపెట్టి ఆకాశంవేపు చూస్తూ తలఎగరవేసి పదినిముషాలు అయినతర్వాత, "ఓహోహో! అడిగవలసిన ప్రశ్న దివ్యమైన టైములో అడిగేరు. మీ అన్నయ్యగారి నక్షత్రానికి మీరు అడిగినటైముకు టక్కున సరిపోయింది చక్రవర్తిలాంటి కొడుకు పుట్టుతాడు. పుత్రస్థానం మహాగొప్పగా వుంది. కుమారుడు పుట్టిన దగ్గరనుండి మీ అన్నగారికి రాజయోగంవుంది. పట్టిందల్లా బంగారం అవుతుంది. ప్రస్తుతం కొంచెం రోజుల్లో వాహనయోగం కూడా వుంది," అని చెప్పేడు.

'మా అన్నయ్య మోటారు కొంటాడని' అన్నపూర్ణ చాలారోజులబట్టి అంపేరిదగ్గరా డబ్బా వాయిస్తూంది,) "అలాగా మా అన్నయ్య మోటారుకొనడానికి మద్రాసు వెళ్ళేటట్లేండి," అని వంటమనిషితో "మాదానా, వెంకటమ్మ? శాస్త్రిలుగారు ఎంత దాఖలాగా ప్రశ్న చెప్పతారోను," అని అంది. మేనల్లుడు పుడతాడన్న సంతోషంతో, శాస్త్రిలుగారికి తాంబూలములో ఐదు రూపాయల నోటు పెట్టి, "ఇదిగో దక్షిణ తాంబూలం పుచ్చుకోండి," అని అర్పించి మళ్లా నమస్కారం చేసింది.

"అన్నట్టు, అమ్మా, అడగడం మర్చిపోయాను. పెద్దముండావాడిని బొత్తిగా జ్ఞాపకం వుండడంలేదు. మా ఆవిడ ఎన్నడో సత్యనారాయణవ్రతం చేస్తానని మొక్కుకుందిట. రేపు పౌర్ణమినాడు చెయ్యాలి అని అంటూంది. చక్కెర దొరకదే అంటే వినడంలేదు. నాలుగైదుచోట్ల విచారించాను. ఎక్కడా దొరకలేదు. ఇక అన్నపూర్ణమ్మగారే గతి అనుకున్నాను. వ్రతానికి కాస్త చక్కెరదయ చేయించగలరా? మీకు వ్రతం చేసిన పుణ్యం వస్తుంది."

"అయ్యో దానికేమిటి? మొన్ననే మా వారు స్పెషలు కూపనుమీద నాలుగు సేర్లు చక్కెర తెప్పించారు. దైవకార్యానికి లేదంటానా?" అని వెళ్ళి సంచీలో సేరుంపావు చక్కెర పోసి తెచ్చి ఇచ్చి,

"అయిదు పావుసేర్లు ఇచ్చాను, చాలా?" అని శాస్త్రిలను అడిగింది.

"చాల కేమిటి తల్లీ, మహా సమృద్ధి. మీరుకాబట్టి ధారాళంగా యిచ్చారు. కాని, ఈ రోజుల్లో ఇలాగ ఎవరిస్తారు? మీలాంటి వుత్తమ ఇల్లాండ్రు వుండబట్టే ఈ కలికాలంలో వానలంటూ పడి పంటలు పండుతూఉన్నాయి. ఎక్కడ చూచినా కలిప్రభావం మండిపోతూన్నది, వర్ణాశ్రమధర్మమన్న మాటే లేదు."

"నాకు ప్రసాదం తెచ్చిస్తారా?"

"అయ్యో, ఎంతమాటన్నారు! తప్పకుండా. ప్రసాదం తెచ్చిఇస్తాను! అంతే కాదు. వచ్చే ఏడాది యీ రోజుల్లో మన లోగిట్లో బాలసారె, వ్రతం చేయించనూ? అమ్మా ఇక నేను సెలవు పుచ్చుకుంటాను." అని ఆమె ఇచ్చిన వస్తువు లన్నీ మూటలు కట్టుకుందుకు చోటు చాలకపోతే చూచి అన్నపూర్ణ, భర్తయొక్క ధోవతి నడిపాతది తెచ్చి యిచ్చింది. అందులో సామానులన్నీ శాస్త్రిలు మూటలు కట్టాడు. అన్నపూర్ణ నౌకరు వెంకటసామిచేత కొన్ని మూటలు శాస్త్రి యింటికి పంపింది. టంగున 12 గంటలు కొట్టేయి.

"ఇదుగో చూడూ, నీ దైవబ్రాహ్మణ సేవ అయిందా ఇక; మనం త్రయోదశి పారణ చేదామా?" అని వకీలుగారు భార్యను అడిగేరు. బాత్ రూములో స్నానంచేస్తూ వకీలుగారు భార్యయొక్క మూఢ నమ్మకాలు గురించి ఎంతో బాధపడ్డారు. కాని, ఒక్క మాటంటే విరుచుకు మీద పడుతుందని ఏమనలేక వూరుకున్నారు.

"అన్నీ మీకు వేళాకోళమే! త్రయోదశి పారణ ఏమిటి నాముఖం?"

"అనగా ద్వాదశి వెళ్లిపోయిందన్నారుగా శాస్త్రిల్లు?"

"సరే రండి. ఇదుగో మీ పట్టుపంచె."

వంటింట్లోకి వెళ్లి భోజనంచేసి వస్తూన్న దంపతులకు 'పోస్టు' అన్న కేక వినపడింది. వెంకటసామి వుత్తరాలు తెచ్చి ఇచ్చాడు. అందులో కొన్ని సెలవు లాఖరులో కోర్టులో దాఖలు చేయవలసిన కేసులనుగురించి క్లయింట్సు వ్రాసినవి. అవి అన్నీ పక్కకు పెట్టి ఒక కార్డు తీసి చదివాడు వకీలు.

"వుత్తరం ఎవరు వ్రాశారు?"

"మీ అన్నయ్య."

"ఆఁ, ఏమని వ్రాశారు?"

"ఏమీ లేదు. తనూ, మీ వదినె ఈ మధ్య మదరాసు వెళ్లేరుట, అక్కడ పెద్ద డాక్టరు దొరసానికి మీ వదినెను చూపిస్తే కడుపు లేదు ఏమీలేదు, ఏదో సుస్తీనించి జైట వుండలేదు, ఆపరేషను చెయ్యాలి అని అందట. మోటారు తను అనుకున్న ఖరీదులో కావలసిన మోడల్ దొరకలేదట. అందుచేత ఇప్పట్లో మోటారుకొనే ప్రయత్నం విరమించుకున్నాడట. అన్ని విధాలా 'డిసప్పాయింటైనాను,' అని వ్రాశాడు."



"సరి, బాగానే వుంది!" అని అన్నపూర్ణ విశ్వేష్టురాలైంది.

* * * *

కాలచక్రంలో అయిదేళ్లు గిర్రున తిరిగాయి. ఆనాడు ఎచ్చట చూచినా సుప్రసిద్ధ గాయకి గానకోకిల' సూర్యప్రభ సంగీతకచ్చేరిగురించి ముచ్చటించేవారే! ఏగోడలమీద చూచినా పాటకచ్చేరీఎడ్వర్ టైజుమెంటు వాల్ పోస్టర్లే, ఊరిలో చాలా హడావుడిగా వుంది. సాయంకాలం అయిదుగంటలకు పాటకచ్చేరీ ఆరంభమవుతుందంటే నాలుగ్గంటలనుండి టౌను హాలులో జనం కిటకిటలాడుతూన్నారు. టిక్కెట్లు చాల హెచ్చు ఖరీదులో వుండుటచే ద్రవ్యాభావంచే కొనుక్కోలేని వారు మేడలెక్కి, గోడలెక్కి ఆమెను చూచి అయినా సంతృప్తిపడదామని వేచి వున్నారు. సరిగా అయిదు గంటలకు సూర్యప్రభ మోటారు యెక్కివచ్చి స్టేజిమీదకు వచ్చింది. సభానమస్కారము చేసి కూర్చుంది. అంతముందే పక్కవాయిద్యపు వారు సిద్ధంగా వుండుటచే సూర్యప్రభ రాగానే 'వాతాపిగణపతిం భజే' అనే కీర్తనతో కచ్చేరీఆరంభమైంది. సభలో అందరూ కూడా చాలా నిశ్శబ్దంగా వుండి విన్నారు. 'అయిదు సంవత్సరాలలోపు పిల్లలను తీసుకురాకూడదు' అని ప్రకటించుటచే ఎక్కడా చంటిపిల్లల ఏడ్పులుకాని, గోలకాని లేదు. అన్నపూర్ణ, ఆమెభర్తకూడా వచ్చి ముందరి వరుసకుర్చీలలో కూర్చున్నారు. అన్నపూర్ణకు సూర్యప్రభను ఎక్కడో చూచినట్లుంది. కాని, ఎక్కడచూచిందో అంతు చిక్కలేదు. గాయకురాలుకూడా ఆమెను తేరిపార చూస్తోంది. 'పవమానసుతుడు పట్టు పాదారవిందములకు' అని మంగళంపాడు వరకూ ఒక్కపిట్ట లేవలేదు.

మరునాడు సాయంకాలం సూర్యప్రభ తమఇంటికి వస్తానని కబురుపంపుటచేత అన్నపూర్ణ చాలా హడావుడిగా వుంది. ఇల్లంతా సర్దింది. తాను ముస్తాబై మూడు గంటలకే తయారుగా వుంది. చేయవలసిన ఫలహారాలేమిటో వంటలక్కకు పురమాయించింది. వెంకటసామిని బజారుకు పూవులు తమలపాకులు తెమ్మని పంపింది. నాలుగు గంటలకు సూర్యప్రభ అన్నపూర్ణ ఇంటికి వచ్చింది. అన్నపూర్ణ ఎదురుగా వెళ్లి ఆమెను ఆహ్వానించి తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టింది. కొంచెంసేపు కుశల ప్రశ్నలు అయిన తరువాత

"నేనెవరో మీరు గుర్తుపట్టేరా" అన్నది సూర్యప్రభ.

"ఎక్కడో చూచినట్లుంది, సరిగా గుర్తు రావడంలేదు" అన్నది అన్నపూర్ణ.

ఎక్కడోకాదు అయిదేళ్ల క్రితం మీ గుమ్మంలో అడుక్కుందుకు వచ్చేను. శోషొచ్చి పడిపోతున్నాను, గుక్కెడు గంజినీళ్లు పొయ్యమంటే మీరు నిరాకరించి 'మోటారుక్రింద పడి చావు' అని అన్నారు. అర్ధగంటసేపు మీ వాకిట్లో కూర్చుని కూర్చుని ప్రాణం విసిగి లేచి వెళ్ళేను. మీ రన్నమాట తప్ప నా చెవికి ఏ శబ్దం వినబడడంలేదు. పరధ్యానంగా రోడ్డుమీద నడుస్తూన్నాను. ఇంతలో నా ప్రక్కనుంచి ఒక మోటారు దూసుకుపోయింది. నేను క్రిందపడిపోయాను. నా చేతిమీదనుంచి మోటారు వెళ్లిపోయింది. మీరు ఏ ముహూర్తాన అన్నారోకాని ఆ మాటప్రకారం మోటారుక్రింద పడ్డాను. అయితే ఇంకా భూమిమీద నూకలుండబట్టి బ్రతికాను. మోటారులోవున్న ధర్మరాజు నన్ను నా ఖర్మానికి వదిలేయక మోటారులో ధర్మాసుపత్రికి తీసుకు వెళ్లేరు. అక్కడ నాలుగురోజుల తరువాత నాకు స్పృహ వచ్చింది. నెల్లాళ్లకు నా చెయ్యిమానింది. ఒకనాడు డాక్టరు దొరసానమ్మ నన్ను పిలిచి 'ఇక నీవు పూర్తిగా ఆరోగ్యవంతురాలివైనావు. నీవు నీయింటికి పోవచ్చును. కాని కుడిచేతితో మాత్రం బలువైన పనులు ఇంకా నెలదాకా చెయ్యరాదు,' అని చెప్పింది.

"మళ్లీ ఆ దుర్భర దారిద్ర్యం, ఆ భిక్షం అడుక్కోవడం, ఆ చింకిరిగుడిసె, ఆ భిక్షపు మూకుడు జ్ఞాపకానికి వచ్చింది. ఈ నెల్లాళ్లు పాలివ్వకపోవుటచే పాలెండిపోయినాయి. ఇన్ని గంజినీళ్లు పోయని తల్లులు పాలు పోస్తారా? నేను పస్తులుండగలను కాని నా చిట్టిబాబు ఆకలికి ఏడుస్తూంటే నేను చూచి ఎల్లా సహించను? ఈ విషయం నా మనస్సుకు తట్టగానే నా కళ్లంట నీళ్లు కాలువలు గట్టాయి. నా స్థితిచూచి జాలిపడి దొరసానమ్మ నా పరిస్థితిఅంతా ఆదరంగా విని చాలా విచారించింది.

"నేనేమీ చెయ్యలేను. కాని మా అక్క మద్రాసులో కాలేజీప్రిన్సిపాల్ గా ఉంది.




1 తులము టిన్నులలో అన్నిచోట్ల దొరకును.

శ్రీ అంబాళ్ అండు కంపెని,

కపాలుపెట్టై నెం. 8. మదరాసు.

ఆమెదగ్గరకు నిన్ను పంపుతాను. ఆమె ఏదయినా నీకు దోవ చూపెట్టుతుంది.' దొరసానమ్మమాటలు వింటే నామీద అమృతవర్షం కురిసినట్లయింది. ఇంతవరకూ నన్ను ఆవిధంగా ఆదరించి మాట్లాడినవారే లేరు. అందరూ మీ రానాడు చీదరించుకున్నట్టు చీదరించుకొన్నవారే. ఆమె చెప్పినమాటకు సమ్మతించి ఒక్కమారు నా గుడిసెదగ్గరకువెళ్లి దగ్గు ఆయాసంతో బాధపడుతూన్న నా పెనిమిటిని చూచివస్తానని చెప్పి వెళ్లినాను. నా గుడిసె ఖాళీగా వుంది. ఎవరి నడిగినా నాభర్త ఏమైనాడో ఎవరూ చెప్పలేదు. కొంచెంసేపు ఏడ్చి చేసే దేమీ లేక దొరసానమ్మదగ్గరకు వెళ్లిపోయినాను. ఆ ధర్మతల్లి నన్ను ఓదార్చి నా కొక జత చీరలు ఖర్చులకు ముప్పయి రూపాయి లిచ్చి అక్క అడ్రసు రాసిచ్చి నన్ను రైలెక్కించింది. ఆ తల్లికి నా చర్మంతో చెప్పులు కుట్టిచ్చినా నేను ఋణం తీర్చుకోలేను. వివరంగా 'పత్రా' రాసి ఇవ్వడంచేత మద్రాసులో దొరసానమ్మ అక్కగార్ని సులభంగానే కనుక్కున్నాను.

ఆమె ఈమె కన్నా కూడా చాలా మంచివారు. నన్ను ఎంతో ఆదరించి నాకోసరం ఎంతమంది దగ్గరకో వెళ్లి చివరకు నన్ను సేవాసదనంలో ప్రవేశపెట్టారు. రెండేళ్లలో నేను థర్డుఫారం పరీక్ష పాసయినాను. సంగీతంలో హైయర్ పరీక్ష పాసయి స్వంతంగా మరి ఒక సంవత్సరం బాగా కృషిచేశాను. సంగీతపరిషత్ సభవారు నాపాట విని నాకు 'గానకోకిల' అని బిరు దిచ్చారు. ఎక్కడచూచినా మద్రాసు ప్రాంతంలో నాపేరే చెప్పుకుంటూన్నారు. నాకు ఒక్కొక్క కచేరికి అయిదేసి, ఆరేసి, వందలు వస్తూంటాయి. గ్రుక్కెడు పాలకు గతిలేని నా కొడుకు వందల రూపాయల విలువగల ఆటసామానులతో ఆడుకుంటూన్నాడు. నా జీవితంలో రెండు ఆదర్శాలు పెట్టుకొన్నాను. ఒకటి నా చిట్టితండ్రికి మంచి ఆస్తి నిలవకేసివుంచాలి. రెండోది నా మొదటిస్థితిలో వున్న సోదర, సోదరీమణులకు నాకు శక్తివున్నంతలో సహాయం చేయాలి. వారానికి మూడురోజులు ఎంతమంది వచ్చినా లేదనకుండా అన్నదానం చేయిస్తాను. ఆరేసి నెలలకు ఆడవాళ్లకు జత చీరలు. మొగవాళ్లకు జతపంచెలు ఇస్తాను. ప్రతిచలికాలంలో ప్రతి ఒక్కరికీ ఒక్కొక్క కంబళి దానంచేయిస్తాను. ప్రతివారూ బీద, గొప్పఅనే భేదంలేకుండా నన్ను పొగిడేవారే. ప్రపంచంలో అందరి ఆదరంపొంద గలుగుతున్నాను. ప్రపంచంలో డబ్బును మించిన వస్తువు మరివొకటి లేదు. అందుకే పెద్దలు 'ధనమూలమిదం జగత్' అని అన్నారు. రానాడు నన్ను మీ అవిధంగా కసిరికొట్టకుండా ఇన్ని గంజినీళ్లు పోసివుంటే నాలో ఈమార్పు రాకపోవును. నూరిని నూరిగానే వుండివుందును. నూరి సూర్యప్రభగా మారి గాయకురాలుగా మీ కంటి ఎదుటకు వచ్చివుండను. ఆనాడు మీరు నన్ను ఆవిధంగా పొమ్మన్నందున నేనీ ఔన్నత్యాన్ని పొందగలిగాను. దీనికి ప్రథమకారకులు మీరే. నిన్న కచ్చేరిలోనే మిమ్మల్ని గుర్తుపట్టేను, నా కథ మీకు వినిపించుదామని కుతూహలం కలిగి ఇవాళ మీ ఇంటికి వచ్చేను. అమ్మా! చాలా ఆలస్యమైంది. ఇక నేను వెళ్లుతాను. మీ అమూల్యమైన కాలాన్ని పాడుచేసినందుకు నన్ను క్షమించండి" అని చెప్పి సూర్యప్రభ లేవబోయింది.

అన్నపూర్ణ నిశ్చేష్టురాలై కథంతా వింది. అవమానంతో కుంగిపోయింది. తాను చేసిన పనికే, అన్నమాటలకు తనలో తను ఎంతో సిగ్గుపడింది. ఎంతయినా పశ్చాత్తాపపడింది. తలఎత్తి చూడలేక చూడలేక సూర్యప్రభకేసి చూచి, "జరిగిపోయినదానికి క్షమించండి. కొంచెం ఫలహారం, టీ పుచ్చుకుని మరీ వెళ్లాలి," అంది.

"ఎందుకమ్మా, నాకెప్పు డవసరమని నీ గుమ్మంముందుకు వచ్చానో అప్పు డిన్ని గంజినీళ్లయినా పోయించావు కావు. ఇప్పుడేమీ నా కవసరం లేదు, ఇకమీదయినా వాకిట్లోకి వచ్చిన బిచ్చగాళ్లనుకసిరి కొట్టక నీకు కలిగినంతలో వాళ్లకు పెట్టి ఆదరించు. 'మానవసేవే మాధవసేవ' అన్న వాక్యం మరువవద్దు." అనేసి సూర్యప్రభ మోటారెక్కి వెళ్లిపోయింది.

అసలే అవమానంతో బాధపడుతూన్న అన్నపూర్ణకు సూర్యప్రభమాటలు మరింత బాధించాయి. ఆమె వెళ్లినదిక్కుకు శూన్యంగా చూస్తూ నిల్చుంది అన్నపూర్ణ

★

---

ఇద్దరు స్నేహితులు ఒకనాటకానికి వెళ్లారు. వారిలో ఒకడు వివాహితుడు, మరొకడు ఇంకా బ్రహ్మచారి.

"హీరో వేసినవాడు హీరోయిన్ మీద తనకి గల ప్రేమని చాలా బాగా ప్రదర్శిస్తున్నాడని మెచ్చుకున్నాడు వివాహితుడు.

"అవును. కాని నీకు తెలుసోలేదో, ఆ హీరో, హీరోయిన్‌లు భార్యాభర్తలే. వాళ్లకి పెళ్లయి ఎనిమిదేళ్లయింది," అన్నాడు బ్రహ్మచారి.

"నిజంగా? వాళ్లిద్దరూ భార్యాభర్తలా? అబ్బ! ఏం గొప్ప యాక్టరోయ్ ఆ హీరో వేసినవాడు?" అని ఆశ్చర్య పడ్డాడు వివాహితుడు.